

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
వరంగల్
శుక్రవారం 11 అక్టోబరు 2024




యాకయ్య(ఫైల్)

పండగ వేళ అపశ్రుతి

విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి
ప్రాణాలతో బయటపడిన మనవడు
అలంకానిపేటలో విషాదం

9

పోయిరా బతుకమ్మ..




ఉర్సుగుట్ట వద్ద కలెక్టర్ సత్యశారద, బతుకమ్మతో తల్లీబిడ్డలు

» ఘనంగా సద్దుల బతుకమ్మ » వర్షంతో స్వల్ప ఆటంకం



పూల పరిమళం పరవశింపజేసింది.. తీరొక్కపూలతో పేర్చిన బతుకమ్మలు కనువిందు చేశాయి.. బతుకమ్మలపై ఏర్పాటు చేసిన అగరు వొత్తుల సువాసనలు వీధుల్లో విహరించాయి. సాయంత్రం ఆడపడుచులు ఇంటి నుంచి బతుకమ్మలతో ఆట స్థలాలకు బైలెల్లారు. యువతుల కోలాటాలు.. మహిళల ఆటపాటలతో వేడుకలు అంబరాన్నంటాయి. అనువణువునా భక్తి భావం ఉప్పొంగింది. ఒక్కేసి పువ్వేసి చందమామా..., రామ రామ రామ ఉయ్యాలో..., చిత్తూ చిత్తూల బొమ్మా.., బంగారు బతుకమ్మ ఉయ్యాలో.. వంటి పాటలకు లయబద్ధంగా చప్పట్లతో ఆడిపాడారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయం కళ్లకు కట్టింది.. ఈ సుందర, సుమధుర దృశ్యాలు గురువారం సద్దుల బతుకమ్మ వేడుకల్లో ఆవిష్కృతమయ్యాయి.

ఉర్సుగుట్ట వద్ద...




ఉర్సుగుట్ట వద్ద బతుకమ్మ సందడి

వరంగల్ కల్చరల్, అక్టోబరు 10: ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ వేడుకలు తుది ఘట్టం గురువారం కన్నులపండువగా సాగింది. జిల్లా వ్యాప్తంగా సద్దుల బతుకమ్మ వేడుకలు అంబరాన్నంటాయి. ఆశ్వయుజ మాసం మహాష్టమి వేళ భద్రకాళి దేవి పుట్టిన రోజున పుడమి తల్లి ప్రసాదించిన ఎంగిలిపడని పూలను తీరొక్క పూలతో శ్రీచక్ర ఆకార రూపంలో అందంగా పేర్చి, పైన పసుపుతో చేసిన గౌరమ్మను ఉంచి బతుకమ్మలను తయారు చేశారు. ఎంతో నిష్టతో బతుకమ్మ లను పేర్చి, ఇళ్లలో పూజలు చేసి, సాయంత్రం ఆటలాడారు. నిమజ్జనానికి ముందు ముత్తయిదవులు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. వరంగల్, నర్సంపేట పట్టణం లో, వర్ధన్నపేట మండల కేంద్రంతో పాటు అన్ని మండలాల్లో, గ్రామాల్లో, తండాలలో వేడుకలు అట్టహాసంగా జరిగాయి. వరంగల్‌లోని పోతన ఆడిటోరియం ప్రాంగణంలో పెద్ద సంఖ్యలో మహిళలు తరలివచ్చి బతుకమ్మ ఆడారు. స్వచ్ఛంద సంస్థలు జెమిని థియేటర్ వద్ద స్వాగతం పలికారు. అలాగే ఉర్సులోని రంగసముద్రం, ఖిలావరంగల్ ప్రాంతం, కాశిబుగ్గలోని రంగనాథస్వామి ఆలయం, దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువు, దత్తక్షేత్రంలోని బోగేశ్వరాలయం, దుర్గేశ్వరాలయం, భద్రకాళి దేవాలయం ప్రాంగణాలలో బతుకమ్మ వేడుకలు జరిగాయి. ఈ వేడుకల్లో నగర మేయర్ గుండు సుధారాణి స్థానిక మహిళలతో కలిసి తోట మైదానంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. అలాగే తన ఇంటిలో పేర్చిన పెద్ద బతుకమ్మతో చిన్న వడ్డెపల్లి చెరువు వద్దకు చేరుకుని వేడుకల్లో పాల్గొన్నారు.

నిమజ్జనం ఏర్పాట్లు

బతుకమ్మల నిమజ్జనానికి ఉర్సు రంగసముద్రం, దేశాయిపేట చిన్నవడ్డెపెల్లి చెరువు, పోతననగర్ భద్రకాళి చెరువుకట్ట, వడ్డెపెల్లి చెరువు కట్ట, హనుమకొండ పద్మా క్షి గుండం తదితర ప్రాంతాల్లో నగర పాలక సంస్థ విస్తృత ఏర్పాట్లు చేసింది. నిమజ్జన స్థలాల వద్ద విద్యుత్‌దీపాలు, తాగునీటి వసతి కల్పించారు. పటిష్ఠ పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

వర్షంతో ఆటంకం కలిగినా

జిల్లాలో పలుచోట్ల స్వల్ప వర్షం పడింది. నగరంలోని పలుచోట్ల పడిన వానతో బతుకమ్మ వేడుకలకు కాస్త ఆటంకం కలిగింది. ఆతర్వాత వేడుకలు యథావిధిగా సాగాయి.

ఉర్సుగుట్ట వద్ద కలెక్టర్

వరంగల్ ఉర్సుగుట్ట రంగలీలా మైదానంలో జరిగిన వేడుకల్లో కలెక్టర్ సత్యశారద పాల్గొన్నారు. మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. వేడుకల్లో నగర పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝూ పాల్గొని, ఉత్సవాలు వైభవంగా జరగడంపై ఆనందం వ్యక్తం చేశారు.



దుర్గామాతగా భద్రకాళి

వరంగల్‌లోని భద్రకాళి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి వేడుకలు గురువారానికి ఎనిమిదో రోజుకు చేరుకున్నాయి. సద్దుల బతుకమ్మ రోజున భద్రకాళి అమ్మవారిని దుర్గామాతగా అలంకరించారు.

-వరంగల్ కల్చరల్

హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిగా జయంతి



జిల్లా సంక్షేమ శాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన జయంతిని అభినందిస్తున్న అధికారులు, సిబ్బంది

హనుమకొండ సిటీ, అక్టోబరు 10 : హనుమకొండ జిల్లా సంక్షేమ అధికారిగా జే.జయంతి నియమితులయ్యారు. ఈ మేరకు ఆమె గురువారం బాధ్యతలు స్వీకరించారు. జనగామ జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారిగా పని చేసిన ఆమె పదోన్నతిపై హనుమకొండ జిల్లాకు వచ్చారు. ఆమెకు అధికారులు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందచేసి అభినందనలు తెలిపారు.

కొత్తగా నియమితులైన టీచర్లు నేడు రిపోర్టు చేయాలి

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 10 : డీఎస్సీ-2024 ద్వారా కొత్తగా ఎంపికై నియామక పత్రాలు పొందిన ఉపాధ్యాయులంతా హనుమకొండ జిల్లా డీఈవో కార్యాలయంలో శుక్రవారం రిపోర్టు చేయాల్సిందిగా డీఈవో డి. వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా నియామక పత్రాలు పొందిన 169 మంది ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయంలో విధిగా రిపోర్టు చేయాల్సిందిగా ఆమె సూచించారు.

సంబురం 'సద్దుల' పర్వం



హనుమకొండ పద్మాక్షి గుడి వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు





చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న నగర మేయర్ గుండు సుధారాణి



హనుమకొండ పద్మాక్షి గుండంలో బతుకమ్మలను నిమజ్జనం చేస్తున్న దృశ్యం



బతుకమ్మ పేరుస్తున్న ఎంపీ కావ్య



బతుకమ్మ పేరుస్తున్న ఎర్రబెల్లి స్వర్ణ



గుట్టుచప్పుడు కాకుండా..

- అనుమతుల్లేకుండా వరంగల్ నగరంలో బాణసంచా తయారీ
- కళ్లుగప్పి పొరుగు జిల్లాల్లోని గోదాములకు తరలింపు
- క్షేత్రస్థాయిలో కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- ఇదే అదనుగా కొందరు వ్యాపారుల దందా
- ఆరేళ్ల నాటి ఘటనను గుర్తుచేస్తున్న స్థానికులు

వరంగల్ క్రైం, అక్టోబరు 10: దసరా, దీపావళి పండుగలతో పాటు పలు కార్యక్రమాలకు బాణసంచా వినియోగం సర్వసాధారణమైంది. గతంలో తమిళనాడు శివకాశి నుంచి బాణసంచా కొనుగోలు చేసి తీసుకొచ్చి అన్ని అనుమతులతో నగరంలో విక్రయించే వారు. సాధారణ రోజుల్లో అయితే ఒకటి రెండు షాపుల్లో మాత్రమే విక్రయాలు జరిగేవి. రానురాను ఆ పరిస్థితి మారింది. ఏకంగా వరంగల్ నగరంలోనే బాణసంచా తయారీ కేంద్రాలు వెలిశాయని, అది కూడా అనుమతుల్లేకుండా జరుగుతున్నట్లు తెలుస్తోంది. చెన్నై నుంచి ముడిసరుకు తెచ్చుకుని వరంగల్‌లో బాణాసంచా తయారు చేస్తున్నట్లు సమాచారం. ప్రధానంగా కాశిబుగ్గ సమీపంలోని ఓ ప్రాంతంలో కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారని, ఈ వ్యాపారం రుచి మరిగిన ఒకరిద్దరు వ్యక్తులు స్థానిక పోలీసులు, రాజకీయ నేతల అండతో ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా జనావాసాల మధ్యే ఏర్పాటు చేశారని సమాచారం. ఈ క్రమంలో ఏదైనా ప్రమాదం జరిగితే స్థానికులు, అక్కడ పనిచేసే వారి పరిస్థితేంటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేయకపోవడం, వీరి వ్యాపారానికి ఎలాంటి అడ్డంకులు లేకపోవడంతో తయారీ దారులు యథేచ్ఛగా దందా సాగిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ప్రమాదంలో 10 మంది మృతి చెందినా ఆగని దందా

ఆరేళ్ల క్రితం వరంగల్‌లోని బాణసంచా తయారీ కేంద్రంలో అగ్ని ప్రమాదం జరిగి పది మంది వరకు మృతి చెందినా నగరంలో దందా ఆగడం లేదనే ప్రచారం సాగుతోంది. దసరా ఉత్సవాలకు అడ్వాన్స్ తీసుకున్న సదరు వ్యాపారులు పెద్దఎత్తున బాణాసంచా తయారీ చేస్తున్నట్లు తెలిసింది. ఎలాంటి అనుమతులు లేకుండా గుట్టుగా తయారు చేస్తున్నట్లు సమాచారం. తయారు చేసిన సరుకు పొరుగు జిల్లాలైన జనగామ, కరీంనగర్‌లోని గోదాముల్లో నిల్వ చేస్తున్నట్లు తెలిసింది. ఇటీవల జనగామ గోదాములో జరిగిన ప్రమాదానికి సంబంధించిన సరుకు వరంగల్‌లో తయారు చేసిందనే వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. యథేచ్ఛగా తయారు చేస్తున్న వ్యాపారులు వరంగల్‌లోనే కాకుండా ఉత్తర తెలంగాణ జిల్లాలకు సరఫరా చేస్తుంటారని సమాచారం. పొరుగు జిల్లాలకు సరఫరా చేసేంత సరుకు ఇక్కడ తయారు చేస్తున్నారంటే ఆ వ్యాపారం ఏ స్థాయిలో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. కానీ ఏదైనా జరిగితే తమ పరిస్థితి ఏంటని స్థానికులు ఆరేళ్లన నాటి ఘటనను గుర్తుచేసుకుని ఆందోళన చెందుతున్నారు.



ఈ నిబంధనలు తప్పనిసరి

బాణసంచా తయారు చేయాలన్నా, విక్రయించాలన్నా పోలీసు, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరి. షాపులు గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే ఉండేలా చూసుకోవాలి. దేవాలయాలకు 200 మీటర్ల దూరంలో షాపులు ఉంచాలి. ఆ షాపుల సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉండకూడదు. ప్రధానంగా జనావాసాలకు దూరంగా తయారీ కేంద్రాలు ఉండాలి.

అనుమతులు లేకుండా విక్రయాలు

ఇక బాణసంచా విక్రయించాలంటే పోలీసు, అగ్నిమాపక శాఖల అనుమతి తప్పనిసరి. ఇవేవీ లేకుండానే వరంగల్ నగరంలో పలుచోట్ల బాణసంచా విక్రయాలు జరుగుతున్నట్లు తెలిసింది. వరంగల్ బట్టలబజార్‌లో ఒకటి రెండు షాపులకు మాత్రమే అనుమతులుండగా, చాలా షాపుల్లో బాణసంచా విక్రయాలు సాగుతున్నట్లు సమాచారం. వరంగల్ నగరంలోని ఒక ఆలయం సమీపంలో బాణసంచా విక్రయాలు జరుపుతున్నట్లు తెలిసింది. యథేచ్ఛగా విక్రయాలు సాగుతున్నా కట్టడి చేయాల్సిన రెండు శాఖల అధికారులు కన్నెత్తి చూడరనే ఆరోపణలున్నాయి. రూ.కోట్లలో జరుగుతున్న వ్యాపారానికి సం బంధించి వ్యాపారులు ఎలాంటి బిల్లులు ఇవ్వరని, కట్టడి చేయాల్సిన అధికారులు తాయిలాలకు అలవాటు పడి వ్యాపారులకు సహకరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి

- విద్యుత్ షాక్‌తో వ్యక్తి మృతి
- ప్రాణాలతో బయటపడిన మనవడు
- వరంగల్ జిల్లా అలంకానిపేటలో విషాదం

నెక్కొండ, అక్టోబరు 10: బతుకమ్మ వేడుకల్లో అపశ్రుతి చోటుచేసుకుంది. తాత, మనవడు విద్యుదాఘాతానికి గురయ్యారు. స్థానికులు అప్రమత్తమవడంతో బాలుడు సురక్షితంగా బయటపడగా, తాత మృత్యువాతపడ్డాడు. పండుగ పూట పెనువిషాదం నింపిన సంఘటన వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేటలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

చీకటి యాకయ్య (41) వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా గురువారం సద్దుల బతుకమ్మ కావడంతో బతుకమ్మ ఆడుకునేందుకు కుటుంబసభ్యులు గ్రామంలోని ఊర చేరువుకు చేరుకున్నారు. యాకయ్య భార్య, ఇద్దరు కూతుళ్లు బతుకమ్మ ఆడుకుంటుండగా, యాకయ్య పెద్ద కుమార్తె ఏడాది వయసున్న కుమారుడిని ఎత్తుకుని పక్కన ఉండి వేడుకల్ని చూస్తున్నాడు. ఇంతలో వర్షం ప్రారంభం కావడంతో తడవకుండా ఉండేందుకు వడివడిగా వెళ్తున్న క్రమంతో బతుకమ్మ వేడుకలకు అమర్చిన విద్యుత్ కాంతుల వైరు యాకయ్యకు తగిలింది. దీంతో వైరు తెగి కిందపడగా దానిపై యాకయ్య పడడంతో షాక్‌కు గురయ్యాడు. గుర్తించిన గ్రామస్థులు బాలుడిని రక్షించేందుకు యాకయ్య చేతిపై బలంగా రబ్బరు చెప్పుతో కొట్టారు. దీంతో బాలుడు ప్రమాదం నుంచి బయటపడ్డాడు. తీవ్రంగా గాయపడిన యాకయ్యను నెక్కొండలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకురాగా, అప్పటికే మృతి చెందాడు. అప్పటివరకు తమతో ఉన్న యాకయ్య తిరిగిరాని లోకానికి వెళ్లడంతో కుటుంబం శోకసముద్రంలో మునిగింది. మృతుడికి భార్య లలిత, ఇద్దరు కుమార్తెలు స్నేహ, రుచిత ఉన్నారు. వేడుకల్లో పాల్గొన్న యాకయ్య మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



యాకయ్య మృతదేహం

లాఠీ వదిలి.. చాక్‌పీస్ పట్టి..

- టీచర్ ఉద్యోగం సాధించిన మహిళా కానిస్టేబుల్



తేజశ్రీ

కాటారం, అక్టోబరు 10: ఇన్నాళ్లుగా లాఠీ చేతబట్టి శాంతిభద్రతల విధులు నిర్వర్తించిన మహిళా కానిస్టేబుల్‌కు ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చింది. కాటారం పోలీస్‌స్టేషన్‌లో డబ్ల్యూపీసీగా పనిచేస్తున్న జగిత్యాల జిల్లాకు చెందిన గడిపెల్లి తేజశ్రీ ఇటీవల డీఎస్సీ ఫలితాల్లో ప్రతిభ కనబర్చి సెకండరీ గ్రేడ్ టీచర్ (ఎస్జీటీ)గా ఎంపికైంది. 2020 బ్యాచ్‌లో డబ్ల్యూపీసీగా ఎంపికై ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో విధులు నిర్వర్తిస్తూ 317 జీవోలో భాగంగా భూపాలపల్లి జిల్లాకు కేటాయింపు పొందిన ఆమెకాటారం పీఎస్‌లో చేరింది. సుదూర ప్రాంతంలో పోలీస్ ఉద్యోగం చేస్తూనే సొంత మండలంలోనే ఉద్యో గం చేయాలని సంకల్పించి పట్టుదల, క్రమశిక్షణతో డీఎస్సీకి సిద్ధమైంది. 65వ ర్యాంకు సాధించి ఎస్జీటీగా ఎంపికైంది. టీచర్ ఉద్యోగం సాధించిన తేజశ్రీని పోలీస్ అధికారులు, సిబ్బంది అభినందించారు.

నేడు ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు శంకుస్థాపన

ములుగు, అక్టోబరు 10: బలహీన వర్గాల విద్యార్థులకు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మించనున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌కు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శుక్రవారం శంకుస్థాపన చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 నియోజకవర్గాలకు మొదటి విడతలో ఈ స్కూళ్లను మంజూరు చేయగా అందులో ములుగు ఒకటి. ములుగు మండలం ఇంచర్ల పంచాయతీ పరిధి సర్వే నంబర్ 17లోని హర్టికల్చర్ నర్సరీకి చెందిన 20 ఎకరాల స్థలాన్ని కలెక్టర్ దివాకర ఇప్పటికే కేటాయించారు. గురువారం సీఎస్ శాంతికుమారి కలెక్టర్‌తో నిర్వహించిన టెలీ కాన్ఫరెన్స్‌లో స్కూల్ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించారు.

గోదావరిలో మునిగి మత్స్యకారుడి మృతి

మహదేవపూర్, అక్టోబరు 10 : చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు గోదావరిలో నీటమునిగి మృతి చెందిన సంఘటన మండలంలోని పలుగులలో గురువారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పసుల మల్లయ్య(48) బుధవారం చేపలు పట్టేందుకు గోదావరి వద్దకు వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. దీంతో బంధువులు, కుటుంబసభ్యులు గోదావరి తీర ప్రాంతంలో వెతకగా గురువారం మల్లయ్య మృతదేహం లభ్యమైంది. మృతుడి భార్య అమ్మక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కాళేశ్వరం ఎస్సై చక్రపాణి తెలిపారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు.



మల్లయ్య మృతదేహం

రతన్‌టాటా సేవలు మరువలేనివి

- ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య

కేయూ క్యాంపస్, అక్టోబరు 10 : వ్యాపార రంగంలో రాణిస్తూనే పేద వర్గాలకు రతన్ టాటా సేవలన్నీ మరువలేనివని కేయూ ఫార్మసీ విభాగం డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య కొనియాడారు. గురువారం కేయూ హాస్టల్ ఆఫీస్‌లో రతన్ టాటా చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. రతన్ టాటా వ్యాపారంలో వచ్చిన లాభాల్లో 60 శాతం జాతీయం చేశారని వివరించారు. యువత రతన్‌టాటాను ఆదర్శంగా తీసుకుని ఎదగాలని పిలుపునిచ్చారు. భారతీయుల గుండెల్లో చెరగాని ముద్రవేసిన గొప్ప వ్యాపారవేత్త నిరాడంబరతకు నిలువెత్తు నిదర్శంగా రతన్ టాటా నిలుచారని కొనియాడారు.

దేశం సంకట స్థితిలో ఉన్న సమయంలో రతన్ టాటా ఆపన్న హస్తం అందించారని గాదె సమ్మయ్య చెప్పారు. ఈ కార్యక్రమంలో కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కాశిబుగ్గ దేవాలయంలో విచారణ

కాశిబుగ్గ, అక్టోబరు 10: కాశిబుగ్గలోని శ్రీ కాశీవిశ్వేశ్వర దేవాలయంలో దేవాదాయశాఖ అధికారులు విచారణ చేపట్టారు. ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల ఎంపికకు నోటిఫికేషన్ వచ్చాక హుండీ తెరవడంపై దుమారం లేచిన విషయం తెలిసిందే. దేవాలయంలో ఏం జరుగుతుందోనని స్థానికులు చర్చించుకున్నారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్, మహేష్ ఆలయంలోని రికార్డులను పరిశీలించారు. ఇటీవల కాలంలో అర్చన, అభిషేకాల రశీదులు జారీ చేశారు, హుండీ ఎవరి సమక్షంలో లెక్కించారు, ఎలాంటి జాగ్రత్తలు పాటించారు తదితర అంశాలపై దేవాదాయ శాఖ అధికారులు ఆరా తీశారు. దసరా తర్వాత తగిన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

బాధ్యతలు చేపట్టిన సీఐ

వరంగల్ చౌరస్తా, అక్టోబరు 10: ఇంతే జార్‌గంజ్ పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా షుకూర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన మచ్చ శివకుమార్ బదిలీ కాగా ఆ స్థానంలో సీఐగా షుకూర్ బదిలీపై వచ్చారు. ఈ మేరకు గురువారం స్టేషన్‌కు రాగా సిబ్బంది బొకేలతో స్వాగతం పలికారు. అనంతరం సీఐగా బాధ్యతలు చేపట్టారు.

ఘనంగా సద్దుల బతుకమ్మ వేడుకలు



శివనగర్‌లోని రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో సెల్ఫీ తీసుకుంటూ..



రంగలీల మైదానంలో వర్షంలోనూ బతుకమ్మ..



ఉర్సుగుట్ట రంగలీల మైదానంలో..

- సందడిగా మారిన ఆట స్థలాలు
- భారీ ఏర్పాట్లు చేసిన అధికారులు

కరీమాబాద్, అక్టోబరు 10: సద్దుల బతుకమ్మ వేడుకలు గురువారం నగరంలోని ఉర్సుగుట్ట రంగలీలా మైదానం రంగసముద్రం చెరువువద్ద ఘనంగా సాగాయి. ఉర్సు గుట్ట రంగలీలా మైదానం పూల జాతరను తలపించింది. దీంతో తెలంగాణ సంప్రదాయం ఉట్టిపడి, పూలజాతర సద్దుల బతుకమ్మ అంగరంగ వైభవంగా కొనసాగింది. మిల్స్‌కాలనీ సీఐ జూపల్లి వెంకట రత్నం, ఎస్సై సురేష్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. వేడుకల్లో దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, ఇతర కమిటీ సభ్యులు, కార్పొరేటర్‌లు మరుపల్ల రవి, పల్లం పద్మ రవి, ముష్కమళ్ల అరుణ సుధాకర్ పాల్గొన్నారు.

వేడుకల్లో పాల్గొన్న కలెక్టర్, సీపీ

ఉర్సుగుట్ట వద్ద నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ సత్యశారద పాల్గొని దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ బతుకమ్మ వద్ద సందడి చేసి మహిళలకు సద్దుల బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. సీపీ అంబర్ కిషోర్ ఝా పాల్గొని వేడుకలు సంతోషంగా జరుపుకోవాలని మీ రక్షణ కోసం పోలీసు శాఖ నిరంతరం సేవలు అందిస్తారని, దసరా రోజు కూడా భారీ పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు.

- శంభునిపేట: రంగశాయిపేట బెస్తం చెరువు వద్ద బతుకమ్మ సంబురాలు అంబరాన్ని అంటాయి. రంగశాయిపేట, శంభునిపేటలతో పాటు 43వ డివిజన్‌లోని పలు కాలనీల మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మలతో తరలి వచ్చారు. వేడుకల్లో కార్పొరేటర్లు గుండు చందనపూర్ణచందర్, ఈదురు అరుణ విక్టర్, పీఏసీఎస్ చైర్మన్ కేడల పద్మజనార్దన్, కర్నె రవీందర్ పాల్గొన్నారు. మెట్టు దర్వాజ రాణి రుద్రమాదేవి బతుకమ్మ ఆట స్థలంలో వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో కార్పొరేటర్‌లు పోశాల పద్మస్వామి, బైరబోయిన ఉమాదామోదర్ యాదవ్, ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.
- పోచమ్మమైదాన్: దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువు వద్ద బతుకమ్మ సంబరాలు వైభవంగా నిర్వహించారు. కార్పొరేటర్ సురేశ్‌జోషి వేడుకల్లో పాల్గొన్నారు. పైడిపెల్లిలో ఎల్లమ్మ గుట్ట వద్ద వేడుకలు నిర్వహించారు. కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్ పాల్గొన్నారు. ఆరెపల్లి, కొత్తపేట విలీన గ్రామాలలో బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.
- మట్టెవాడ: రామన్నపేటలోని తన స్వగృహంలో నగర మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ నివాసంలో సతీమణి నన్నపునేని వాణి, పిన్నవారి వీధిలో కార్పొరేటర్ గందె కల్పన, బస్వరాజ్ శిరిష బతుకమ్మలను పేర్చారు. బతుకమ్మ పండుగ సందర్భంగా వరంగల్ సంస్కార భారతి ఆధ్వర్యంలో జెమిని థియేటర్ సెంటర్ వద్ద బతుకమ్మలతో తరలివస్తున్న మహిళలకు స్వాగతం పలికారు.
- గిర్మాజీపేట: శ్రీగోవిందరాజస్వామి దేవాలయం ప్రాంగణం సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్ని అంటాయి. అలాగే గిర్మాజీపేట, చార్‌బౌళి, వరంగల్ చౌరస్తా, సీకేఎం ఆస్పత్రి వీధి, గిర్మాజీపేట బొడ్రాయి, జెపిఎన్ రోడ్డు, లక్ష్మీపురం, కూరగాయల మార్కెట్, గోవిందరాజుల గుట్ట, రామావారివీధి తదితరప్రాంతాలకు చెందిన మహిళలు గోవిందరాజుల గుట్ట ప్రాంగణంలో బతుకమ్మలను పెట్టి చుట్టుచేరి బతుకమ్మ పాటలు పాడి ఆటలు ఆడారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ పాల్గొన్నారు.
- ఖిలావరంగల్: తూర్పుకోట మహిళలు పెద్దమ్మదేవాలయం వద్ద గల మైదానంలో, ముదిరాజ్, యాదవులు మెట్టుకోట వద్ద గల చెరువు వద్ద బతుకమ్మలను ఆడారు. మధ్యకోటలోని మహిళలు ఏకశిల పిల్లలపార్క్ మైదానంలో ఆడి గుండు చెరువు బతుకమ్మలను వేశారు. మెట్టుకోట చెరువు వద్ద, 34,35 డివిజన్ శివనగర్ మహిళలు కరెంట్ ఆఫీస్ వద్ద గల చెరువువద్ద, శివనగర్‌లోని రామాలయం, ధనమైసమ్మ దేవాలయం వద్ద స్థానిక మహిళలు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో 18, 34, 35, 37, 38, 40 డివిజన్‌ల కార్పొరేటర్లు వస్కుల బాబు, సోమిశెట్టి ప్రవీణ్, దిడ్డి కుమారస్వామి, వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబోయిన ఉమ-దామోదర్, పోశాలపద్మ-స్వామి పాల్గొన్నారు.





ఇంట్లో బతుకమ్మను పేరుస్తున్న నన్నపునేని వాణి, పిన్నవారివీధిలో బతుకమ్మతో కార్పొరేటర్ కల్పన



సద్దుల సంబురంతో కాంతులీనుతున్న వరంగల్ ఉర్సుగుట్ట రంగలీల మైదానం..



పైడిపల్లిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



గోవిందరాజుల గుట్ట వద్ద బతుకమ్మను ఎత్తుకున్న కార్పొరేటర్ అనిల్‌కుమార్



బతుకమ్మలతో మూడో డివిజన్ కార్పొరేటర్ జన్ను షిభారాణిఅనిల్



రంగశాయిపేట బెస్తం చెరువు వద్ద బతుకమ్మ సంబురాలు

వృద్ధాశ్రమంలో అన్నదానం



వృద్ధాశ్రమంలో అన్నదానం నిర్వహిస్తున్న నవీన్‌రెడ్డి కుటుంబ సభ్యులు

కరీమాబాద్, అక్టోబరు 10: తన పుట్టిన రోజును పురస్కరించుకొని రంగశాయిపేట ప్రాంతానికి చెందిన దివ్య చికెన్ సెంటర్ యజమాని కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి గురువారం రంగశాయిపేట శివారులోని ఎలగందుల అమృత స్మాకర వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన పుట్టిన రోజు వేడుకను ఇలా వృద్ధాశ్రమంలో జరుపుకొని వారికి అన్నదానం చేయడం సంతృప్తిని కలిగించిందన్నారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి కుటుంబ సభ్యులు కొండ్రెడ్డి ధర్మారెడ్డి, పిచ్చమ్మ, భార్య మాధురి, కుమారులు శ్రీరాంరెడ్డి, అభిరామ్‌రెడ్డి, వాగ్బాట యోగా సంఘం మిత్రులు నిరంజన్‌రెడ్డి, రాంచందర్, కన్నయ్య,కర్ణాకర్, రాంబాబు పాల్గొన్నారు.

రావణవధ విజయవంతానికి కృషి చేయాలి

ఖిలావరంగల్, అక్టోబరు 10: దసరా(రావణవధ) కార్యక్రమాన్ని ఘనంగా జరుపుకోవాలని బతుకమ్మ-దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బోగి సురేష్ కోరారు. గురువారం తూర్పుకోటలో అర్షం రాంబాబు అధ్యక్షతన ఉత్సవ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సద్దుల బతుకమ్మ వేడుకల్లో భాగంగా ఉత్తమ బతుకమ్మలకు బహుమతులను అందిస్తామన్నారు. అలాగే తూర్పుకోట వద్ద ఏర్పాటు చేయనున్న 45 అడుగుల రావణవధ ప్రతిమ దహన కార్యక్రమాన్ని పార్టీలకతీతంగా విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో బతుకమ్మ- దసరా ఐక్య కమిటీ నాయకులు బోయిని దూడయ్య, కందిమళ్ల మహేష్, బెడిద వీరన్న, బొలుగోడ్డు శ్రీనివాస్, వనపర్తి కర్ణాకర్, ఏసీ రెడ్డి రమేష్, బంగారిశ్రీనివాస్, వనపర్తి ధర్మరాజు, రాజ్‌కుమార్, సారంగపాణి, కుమారస్వామి, కిరణ్, అయిలయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బోగి సురేష్

కరపత్రాల ఆవిష్కరణ

శంభునిపేట, అక్టోబరు 10: రంగశాయిపేటలో నిర్వహించే దసరా ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను గురువారం నిర్వాహకులు మహంకాళీ మైదానంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు గుండు పూర్ణచందర్, ప్రధాన కార్యదర్శి దామెరకొండ కర్ణాకర్, కోశాధికారి కొక్కొండ భాస్కర్, సలహాదారులు ముత్తినేని రామ్మూర్తి, బీవీ రామకృష్ణ ప్రసాద్, పరికిపండ్ల రాజేశ్వర్‌రావు, మండల లక్ష్మయ్య, కంచ రమేష్, బజ్జూరి వీరేశం పాకాల మనోహర్, ఎలుగు అశోక్, కత్తెర పల్లి వేణు, గుండు నవీన్ కుమార్ పాల్గొన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

వరంగల్ కల్చరల్, అక్టోబరు 10: మట్టెవాడలోని శ్రీవేంకటేశ్వర స్వామి సంతాన ఆంజనేయస్వామి సహిత రాజరాజేశ్వర స్వామి దేవాలయంలో వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈనెల 9 నుంచి 14 వరకు విశేష పూజలు, దసరా వేడుకలు, కల్యాణం, వాహన సేవలు జరుగుతాయి. దండాపంతుల హరిరాంశర్మ, దండాపంతుల హరిహర ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో భక్తులు గురువారం రథసేవలో పాల్గొన్నారు.



మట్టెవాడలో రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కిక్ బాక్సింగ్ క్రీడాకారిణికి సత్కారం

శంభునిపేట, అక్టోబరు 10: నగరంలోని 42వ డివిజన్ తెలంగాణ కాలనీకి చెందిన బాక్సింగ్ క్రీడాకారిణి మార్క సంతోషిణి ఇటీవల జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో బంగారు పతకంతో మెరిసింది. గురువారం కాలనీలో కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్ సంతోషిణిని, ఆమె తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. ఆడపిల్లలను ప్రోత్సహిస్తే అద్భుతాలు చేస్తారని, ఇందుకు నిదర్శనమే సంతోషిణి అని కార్పొరేటర్ అన్నారు. కార్యక్రమంలో కాలనీ బాధ్యులు శ్రీనివాస్, హరిలాల్, కొమ్మాలు, కరుణాకర్, రాజు, విద్యాసాగర్, నారాయణ, రఘునందన్, వెంకన్న, చిరంజీవి, తిరుపతి పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు సభ్యులుగా అవకాశం కల్పించండి

కాశిబుగ్గ, అక్టోబరు 10: కాశిబుగ్గలోని కాశీవిశ్వేశ్వర, రంగనాథ దేవాలయాల ట్రస్ట్ బోర్డు సభ్యులుగా తమకు అవకాశం కల్పించాలని ఆలయాల పరిరక్షణ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు ఆలయం చరిత్రతో కూడిన కరపత్రాన్ని గురువారం కాశిబుగ్గలో ఆవిష్కరించారు. కమిటీ అధ్యక్షుడు పెరుమాళ్ల లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కొణతం కృష్ణ మాట్లాడుతూ ఆలయాల పరిరక్షణను చూస్తున్న తమకు ట్రస్ట్ బోర్డు సభ్యులుగా అవకాశం ఇస్తే మరింత అభివృద్ధి చేస్తామన్నారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళిని కలిసి గతంలో తాము చేసిన సేవా కార్యక్రమాలను వివరిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు ఆకెన వెంకటేశ్వర్లు, సుధాకర్, మాటేటి అశోక్ కుమార్, ప్రకాష్ రెడ్డి, ఆనంద్ పాల్గొన్నారు.

భారీగా పెరిగిన మటన్ ధరలు

- వెయ్యికి చేరువైన కిలో మాంసం
- నాలుగేళ్ల తర్వాత పెంచిన వ్యాపారులు
- పొట్టేళ్లకు భారీ డిమాండ్

శంభునిపేట, అక్టోబరు 10: దసరా నాడు ప్రతీ ఇంట్లో రెండు మూడు రకాల మాంసపు కూరలు ఉండాల్సిందే. ఇందులో పొట్టేలు మాంసం అంటే మోజు మరింత ఎక్కువ. దసరా వచ్చిందటే చాలు పొట్టేళ్లకు భలే గిరాకీ ఏర్పడుతుంది. ప్రస్తుతం మార్కెట్లో మాంసం ధరలు అమాంతం పెరిగాయి. శ్రావణంలో పోచమ్మ బోనాల నుంచి పొట్టేళ్లకు డిమాండ్ పెరుగుతూ వస్తోంది. నాలుగునెలల క్రితం 10కిలోల మాంసం కల్గిన పొట్టేలు రూ. 8వేలు అమ్మగా, ప్రస్తుతం రూ.12వేలకు చేరింది. సంతల్లోనే కిలో మాంసం ధర వెయ్యికి దాటింది. వరంగల్ నగరంలో 2019 దసరా సీజన్‌లో కిలో మాసం రూ.800 అమ్మగా 2021లో దసరా సమయంలో 900, ప్రనస్తుతం కొన్ని ప్రదేశాల్లో రూ. 1000 పలుకుతోంది.



వినియోగానికి సరిపడా ఉత్పత్తి లేదా..

మాంసం వినియోగానికి సరిపడా ఉత్పత్తి వరంగల్ జిల్లాలో లేదనే చెప్పాలి. జిల్లాలో నెలకు సుమారు 6వేల జీవాలు మాంసం ఉత్పత్తికి వినియోగిస్తున్నారు. పెళ్లిళ్లు, పండుగ సీజన్‌లలో అయితే రెట్టింపు అవుతుంది. కానీ, ఉత్పత్తి మాత్రం అందులో సగం కూడా లేదు. జిల్లాలోని సంతల్లోనే కాక హైదరాబాద్, అనంతపూర్, పెబ్బేరు, మిర్యాలగూడ, ఇచ్చోడ, నవీపేట, నాగ్‌పూర్, సంతలకు వెళ్లి పెద్ద సంఖ్యలో గొర్రెలు, మేకల్ని మాంసం వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ ప్రాంతాల్లోని యాటల మాంసం రుచిగా ఉంటుందనే నమ్మకంతో వీటికి ఎక్కువ డిమాండ్ ఉంటుంది. మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ప్రాంతాల నుంచి జీవాలను వ్యాపారులు తరలిస్తున్నారు.

డిమాండ్ కారణంగా ధరలు పెంచాల్సి వస్తోంది

రావుల ప్రవీణ్, వరంగల్ మాసం విక్రయదారుల సంఘం ప్రతినిధి



మార్కెట్‌లో పొట్టేళ్ల ధరలను విపరీతంగా పెంచటంతో మాంసం ధరలను పెంచాల్సి వస్తోంది. నాణ్యమైన తెలంగాణ పొట్టేళ్లకు విపరీతమైన డిమాండ్ ఉంది. దసరా పండుగ రావటంతో వ్యాపారులు డిమాండ్‌ను పెంచేశారు. ప్రస్తుత మార్కెట్ ధరలలో నష్టాలు చూస్తున్నాం. మార్కెట్‌లో డిమాండ్ తగ్గితే త్వరలోనే మళ్లీ ధరలను తగ్గిస్తాము.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL శుక్రవారం 11 అక్టోబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

మునగతోటలను పరిశీలించిన కలెక్టర్

గీసుగొండ, అక్టోబరు 10 : మండలంలోని కొనాయిమాకుల పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపట్టిన మునగతోటలను కలెక్టర్ డాక్టర్ సత్యశారద గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్లతోటల సాగుకు ఈజీఎస్ ద్వారా అందించే సబ్సిడీలను సద్వినియోగం చేసుకొని మంచి లాభాలను ఆర్జించవచ్చన్నారు. మునగతోట సాగు వివరాల గురించి స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఏపీవో చంద్రకాంత్, టీఏ సురేష్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా సద్దుల బతుకమ్మ



వర్ధన్నపేటలో ఆటపాటలతో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నర్సంపేటలో బతుకమ్మతో మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజని



ఖానాపురంలో వర్షంలో బతుకమ్మలతో వెళ్తున్న మహిళలు

నర్సంపేట, అక్టోబరు 10 : ఆడపడుచులకు అత్యంత ప్రీతిపాత్రమైన సద్దుల బతుకమ్మ వేడుకలు నర్సంపేట పట్టణంలో అంబరాన్నంటాయి.గురువారం సాయంత్రం 5.30గంటల ప్రాంతంలో అన్ని వాడల నుంచి డప్పు చప్పుళ్లతో చిన్నారులు, యువతులు, మహిళలు, వృద్ధులు వయోభేదం లేకుండా బతుకమ్మలను చేతబూని బతుకమ్మ వేడుక స్థలమైన అంగడి ఆవరణకు చేరుకొని జట్లు జట్లుగా విడిపోయి బతుకమ్మ, బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుకమ్మ ఉయ్యాలో.... ఒక్కేసి పువ్వేసి చందమామ, రెండు జాములయే చందమామ... రామరామ ఉయ్యాలో, రామనే శ్రీరామ ఉయ్యాలో.. అంటూ లయబద్ధంగా చప్పట్లు కొడుతూ వాటి చుట్టూ తిరుగుతూ పాటలు పాడుతూ ఆడిపాడి ఆనందం పొందారు. సాయంత్రం 5.30 గంటల నుంచి 7గంటల వరకు మహిళలు సద్దుల బతుకమ్మ వేడుకలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకొని ఒకరికొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకొని వెళ్ళిరావమ్మా గౌరమ్మ వెళ్లి రావమ్మా అంటూ వేడుకొని బతుకమ్మలను మాదన్నపేట కాలువలో నిమజ్జనం చేశారు. సద్దుల బతుకమ్మ వేడుకలను పురస్కరించుకొని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఆకర్శనీయంగా ఆర్చిని ఏర్పాటు చేసి ఇక్కడి నుంచి వేడుకలు జరిగే అంగడి ఆవరణ వరకు మునిసిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు సీరిస్ బల్బులు, ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనితో పాటు మహిళా కౌన్సిలర్లు, పట్టణ మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మునిసిపల్ కమిషనర్ ఇతర అధికారులు పర్యవేక్షించారు. వేడుకల స్థలం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రమణమూర్తి, ఎస్సైలు, పోలీసు సిబ్బంది గట్టి బందోబస్తును ఏర్పాటు చేసి వేడుకలను పర్యవేక్షించారు. కాగా, బతుకమ్మ వేడుకల స్థలానికి బతుకమ్మలతో మహిళలు వెళ్తుండగా పది నిమిషాల పాటు వర్షపు జల్లులు కురిశాయి. ఆ తర్వాత వర్షం జల్లులు కనుమరుగవడంతో గ్రౌండ్‌కు చేరుకున్న మహిళలు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని 27గ్రామ పంచాయతీలలో కూడా మహిళలు బతుకమ్మ వేడుకలను జరుపుకున్నారు.

• వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలో మహిళలు, యువతులు, చిన్నారులు సద్దుల బతుకమ్మ వేడులను ఘనంగా నిర్వహించారు. మునిసిపల్ ఆధ్వర్యంలో మహిళలు బతుకమ్మను ఆడుకునేందుకు రంగలీల మైదానంలో లైటింగ్, సౌండ్స్ అధికారులు ఏర్పాటుచేశారు. మహిళలు సంతోషంగా బతుకమ్మలు ఆడుకొని నిమజ్జనం చేసేందుకు మునిసిపల్ అధికారులు కావాల్సిన జాగ్రత్తలతో ఏర్పాట్లు పూర్తి చేయడంతో మహిళలు ఆటపాటలతో సంతోషంగా బతుకమ్మ వేడుకలను నిర్వహించుకున్నారు.

ప్రకృతిని ఆరాధించే గొప్ప సంప్రదాయం తెలంగాణ ప్రజలదని వర్ధన్నపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ అన్నారు. గురువారం సద్దులను బతుకమ్మ పండగ సందర్భంగా మునిసిపల్ రెండో డివిజన్ కౌన్సిలర్ తోటకూరి రాజమణితో కలిసి భారీ బతుకమ్మని పేర్చారు. పట్టణ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు.

• వర్ధన్నపేట రూరల్: మండలంలోని ఆయా గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు వైభవంగా జరిగాయి. చెరువులు, కుంటల వద్ద సద్దుల బతుకమ్మ ఆడి నిమజ్జనం చేశారు. వాయినాలు ఇచ్చుకుంటూ, ప్రసాదాలు పంపిణీచేశారు. చిన్నారులు తమ చిట్టి చేతులతో బతుకమ్మలను తీసుకెళ్లడం అందరిని ఆకర్షింపచేసింది.

• నెక్కొండ : మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన సద్దుల బతుకమ్మ వేడకల్లో మహిళలు ఆనందోత్సవాలతో పాల్గొన్నారు. చెరువుల వద్ద ఉంచి బతుకమ్మ పాటలు పాడుతూ కోలాట నృత్యాలు చేశారు. మహిళలు ఒకరికి ఒకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. అనంతరం చెరువులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

• చెన్నారావుపేట : మండలంలోని పలు గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో పెద్ద మోరీ వద్ద బతుకమ్మలను మహిళలు నిమజ్జనం చేశారు.

• రాయపర్తి : మండలంలోని ఆయా గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలను చెరువులు, కుంటల వద్దకు వెళ్లి పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. ముత్తైదువులు వాయినాలు ఇచ్చుకుని, గౌరమ్మను గంగమ్మ చెంతకు పంపుతూ ప్రసాదాలు పంచి పెట్టారు.

• దుగ్గొండి: మండలంలోని వివిధ గ్రామాల్లో సద్దుల బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. వర్షం పడుతున్నప్పటికీ మహిళలు ఉత్సాహంతో బతుకమ్మలు ఎత్తుకొని చెరువుల దగ్గరకు పోయి నిమజ్జనం చేశారు.



నర్సంపేటలో సద్దుల బతుకమ్మ ఆడుతున్న మహిళలు

గురువారం సాయంత్రం వివిధ గ్రామాల్లో వర్షం పడగా మహిళలు గొడుగులు చేపట్టి బతుకమ్మలతో వేడుకల్లో పాల్గొన్నారు.

• పర్వతగిరి : సద్దుల బతుకమ్మ పర్వదిన వేడుకలను మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అందంగా అలరించిన బతుకమ్మలకు ప్రథమ బహుమతి రూ.3,116, ద్వితీయ రూ.2,116, తృతీయ బహుమతి రూ.1,116 అందించారు.

• ఖానాపురం : సద్దుల బతుకమ్మ వేడుకలను మండల వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. బతుకమ్మలు వెళ్లే సమయంలో వర్షంపడడంతో మహిళలు ఇబ్బందులు పడ్డారు. కాగా, ఖానాపురంలో వర్షంతో మహిళలు ఇబ్బందులు పడుతుండడంతో మాజీసర్పంచ్ చిరంజీవి హరిబాబు, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి చొరవతో మండల కేంద్రంలోని రెడ్డి పెద్దారంగారెడ్డి ఫంక్షన్ హాల్‌లో బతుకమ్మ ఆడుకోవడానికి అవకాశంకల్పించారు.



వర్ధన్నపేటలో బతుకమ్మను పేరుస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్ అరుణ



ఖానాపురంలో ఫంక్షన్‌హాల్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



చెన్నారావుపేటలో బతుకమ్మ ఆటలు ఆడుతున్న మహిళలు



గీసుగొండ మండలం రాంపురంలో...





సంగెంలో బతుకమ్మను పేరుస్తున్న మాజీ ఎంపీపీ కళావతి, పర్వతగిరిలో బతుకమ్మలతో మహిళలు

ఆడబిడ్డల పండగ బతుకమ్మ

• ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి

నెక్కొండ, అక్టోబరు 10 : తెలంగాణ ఆడబిడ్డల పండగ బతుకమ్మను మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకుంటారని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. మండలంలోని చంద్రుగొండలో ఏర్పాటు చేసిన బతుకమ్మ విగ్రహాన్ని గురువారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పండగలు దేశ సంప్రదాయానికి నిలయమని భారతదేశ ప్రతిష్టను పెంచేవి పండగలన్నారు. ఈ బతుకమ్మ విగ్రహాన్ని బక్కి ఎల్లయ్య జ్ఞాపకార్థం కుమారులు మాజీ జడ్పీటీసీ బక్కి కవిత-అశోక్, రాజేందర్, నరేష్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో టీసీసీ మెంబరు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ , రామాలయ కమిటీల చైర్మన్‌లు రావుల హరీష్‌రెడ్డి, కొమ్మారెడ్డి సుధాకర్ రెడ్డి, ఓబీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచకొండ రఘు, కాంగ్రెస్ పార్టీ చంద్రగొండ గ్రామ అధ్యక్షుడు గోక అనిల్, నాయకులు చెన్నకేశవులు, సాయికృష్ణ, సుబ్బా రెడ్డి, మహిపాల్‌రెడ్డి , మల్లారెడ్డి, సాంబయ్య శ్రావణ్‌రెడ్డి, సంపత్, స్వరూప, స్వర్ణ, విజయ తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండలో బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

• దుగ్గొండి: మండలంలోని గుడ్డెల్గులపల్లిలో గురువారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి బతుకమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించారు. గ్రామంలో బతుకమ్మ ఆడుకొనే పెద్ద చెరువు దగ్గర బతుకమ్మ తల్లి విగ్రహాన్ని గ్రామస్థులు ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి టెంకాయ కొట్టి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో బతుకమ్మ పండగకు ప్రత్యేకత ఉందన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబు, చెన్నూరి కిరన్‌రెడ్డి, హిగే రామారావు జంగిలి రవి, పోగాకు వెంకటేశ్వర్లు, బొల్లెపల్లి రాము తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మను పేరుస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది

నల్లబెల్లి, అక్టోబరు 10 : మండల కేంద్రంలోని తన ఇంట్లో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి తంగేడు, బంతి తదితర పూలతో గురువారం బతుకమ్మను అంగరంగ వైభవంగా పేర్చారు. సద్దుల బతుకమ్మ ఆడపడుచుల ఆత్మగౌరవ సంస్కృతి, సంప్రదాయానికి చిహ్నం అన్నారు. బతుకమ్మ బతుకునిచ్చే అమ్మగా ఆత్మాభిమానంతో సగర్వంగా ఆడపడచులందరూ జరుపుకోవాలని కోరారు. అలాగే నర్సంపేట నియోజకవర్గంలోని ఆడపడుచులందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు.



బతుకమ్మ పేరుస్తున్న మాజీ ఎమ్మెల్యే పెద్ది

కాంగ్రెస్- బీఆర్ఎస్ మధ్య ఫ్లెక్సీల వివాదం

• ఇరు పార్టీల నాయకులను వారించిన పోలీసులు

నల్లబెల్లి, అక్టోబరు 10 : సద్దుల బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు నల్లబెల్లి మండల కేంద్రంలో పార్టీ కార్యాలయల ముందు, ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఫ్లెక్సీలను గురువారం ఏర్పాటు చేశారు. అనంతరం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ముందు ఉన్న ఫ్లెక్సీని గుర్తుతెలియని వ్యక్తులు చింపి వేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ నాయకులను బీఆర్ఎస్ నాయకులు దూషిస్తున్నారని ఆరోపించారు. రెండు పార్టీల కార్యాలయాలు దగ్గరగా ఉండడంతో కాంగ్రెస్-బీఆర్ఎస్ పార్టీల నాయకుల మధ్యన మాటామాట పెరిగి ఘర్షణ వాతావరణం నెలకొంది. రెండు పార్టీలు రోడ్లపైనే నిరసన వ్యక్తం చేశాయి. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు ఘటన స్థలికి చేరుకొని ఇరువర్గాల పార్టీల నాయకులను, కార్యకర్తలను వారించారు. అనంతరం ఘటనస్థలి నుంచి నాయకులను పంపించారు. నల్లబెల్లి మొత్తం పోలీసుల పహారాలో ఉంది. అలాగే నల్లబెల్లికి ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్, నర్సంపేట ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ సాయిరమణ చేరుకొని పార్టీల నాయకులను రోడ్ల మీద ఉండవద్దని వారించారు. స్థానిక ఎస్సై ప్రశాంత్‌బాబుకు తగిన సలహాలు సూచనలు తెలియజేశారు. నల్లబెల్లిలో వైన్స్ షాపులతో సహా, అన్ని షాపులను బంద్ చేశారు. దీంతో మండల రాజకీయాలు ముందు, ముందు ఏలాంటి ఘర్షణలకు తావిస్తాయోనని చర్చ నడుస్తోంది.



నాయకులను వారిస్తున్న పోలీసులు

సేవాలాల్ మహరాజ్ గుడి వద్ద పూజలు

నెక్కొండ, అక్టోబరు 10 : మండలంలోని అజ్మీర మంగ్యాతండాలోని సేవాలాల్ మహరాజ్ దేవాలయంలో గురువారం సేవాలాల్ మాల ధరించిన భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. నూతనగా నిర్మాణం జరుగుతున్న సేవాలాల్ మహరాజ్ దేవాలయంలో జయంతి వరకూ విగ్రహ ప్రతిష్ట చేస్తామని భక్తులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో మహరాజ్ గుడి అధ్యక్షుడు మూడు శ్రీనివాస్, బానోతు వెంకన్న, గుగులోతు చక్రు, రమేశ్, నవీన్ పాల్గొన్నారు.

భక్తులకు అన్నప్రసాద వితరణ

నెక్కొండ, అక్టోబరు 10 : దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నెక్కొండలోని బొడ్రాయి దగ్గర ఏర్పాటు చేసిన దుర్గాదేవి వద్ద బుధవారం రాత్రి భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, ఎస్సై మహేందర్, అంజనేయస్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

వయోవృద్ధుల శ్రమదానం

చెన్నారావుపేట, అక్టోబరు 10 : మండల కేంద్రంలోని వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రధాన రోడ్లను శుభ్రం గురువారం చేశారు. గ్రామంలో బతుకమ్మ, దసరా పండుగను పురస్కరించుకొని శ్రమదానంతో రోడ్లను శుభ్రం చేశారు. గ్రామంలో సేవ కార్యక్రమాలను కొనసాగిస్తామని సంఘం మండల అధ్యక్షుడు ఈగ సత్యనారాయణ అన్నారు. కార్యక్రమంలో సాంబయ్య, కుమారస్వామి, నారాయణరెడ్డి, మల్లయ్య కృష్ణయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రైతు మృతి

చెన్నారావుపేట, అక్టోబరు 10 : రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రైతు మండల మల్లయ్య(62)చికిత్స పొందు తూ గురువారం మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... మండల కేంద్రంలోని బతుకమ్మ మోరీ వద్ద నుంచి మల్లయ్య సైకిల్‌పై వస్తుండగా మంగళవారం ద్విచక్ర వాహనం వెనుక నుంచి ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు వరంగల్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఐలమ్మ, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.



మల్లయ్య (ఫైల్)

దీప్తిని సన్మానించిన తహసీల్దార్

పర్వతగిరి, అక్టోబరు 10 : పారాలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని సాధించిన జీవంజి దీప్తిని గురువారం ఆమె స్వగ్రామమైన మండలంలోని కల్లెడలో తహసీల్దార్ టి.వెంకటస్వామి సన్మానించారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. దేశప్రతిష్టతో పాటు కల్లెడ గ్రామం పేరును అంతర్జాతీయస్థాయికి తీసుకెళ్లిన ఆమె ఘనతను కొనియాడారు. దీప్తికి ప్రోత్సాహమందించి ఆమె విజయంలో భాగస్వాములైన తల్లిదండ్రులు ధనలక్ష్మి, యాదగిరిలను అభినందించారు.



దీప్తిని సన్మానిస్తున్న తహసీల్దార్

ఎంబీబీఎస్ విద్యార్థికి ఆర్థికసాయం

గీసుగొండ, అక్టోబరు 10 : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన నిరుపేద విద్యార్థిని నమిండ్ల సుష్మస్వరాజ్ నీట్‌లో ప్రతిభ కనబరిచి వికారాబాద్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించింది. సుష్మస్వరాజ్ తల్లిదండ్రులు సునీత, రవి నిరుపేదలు కావటంతో వారి ఆర్థిక పరిస్థితి బాగాలేదు. రవి ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వారి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పారిశ్రామికవేత్త అల్లం బాలిరెడ్డి ఆమె మెడిసిన్ చదువు కొరకు రూ.25వేలను గురువారం అందించారు. ప్రతీ సంవత్సరం కూడా సుష్మస్వరాజ్ మెడిసిన్ అయ్యేవరకు రూ.25వేల చొప్పున అందిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అధికార ప్రతినిధి చాడా కొమురారెడ్డి, నాయకులు మంద రమేష్, మర్రి రాజలింగం, వీరభద్రయ్య పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందిస్తున్న బాలిరెడ్డి